# మాయా మాళవ గౌళ

రాంమూర్తి సీతాపతుల సంభాషణ పిల్లలు రావటంతో ఆగిపోయింది. రాంమూర్తి కొడుకులిద్దరూ చప్పట్లు చరుచుకుంటూ అప్పుడే బళ్ళోంచి వచ్చారు. లోపల్నించి పెద్దపిల్ల వచ్చి 'కాఫీ తయారౌతోంది, అంత వరకూ మీ దగ్గర చందమామ కథలు చెప్పించుకో మంది అమ్మ' అంది. రాంమూర్తి సంతానానికి కొత్త లేదు. ఎన్నడూ చూడని వాళ్ళ దగ్గరికైనా వాళ్ళు బహు తేలిగ్గా చేరుకుంటారు. అందరి కంటే చిన్నవాడు అప్పుడే సీతాపతి ఒళ్లో కూచున్నాడు. సీతాపతికి ఇన్నాళ్ల ఒంటరి జీవితంలోనూ కుటుంబ పరిధిలో కూచోటం ఇదే మొదటిసారి. కథలు వింటూ తన్మయత్వం చెందిపోయే పిల్లల్ని చూస్తోంటే అతనికి చాలా సంతస మవుతోంది, తన స్నేహితుడి జీవితం సహజమైన మార్గంలో నడుస్తూన్నందుకు ఆనందంగా వుంది.

కాఫీ తయారయిందని లోపల్నించి పిలుపు. పిల్లలంతా లోపలికి పరిగెత్తారు. రాంమూర్తి తన పిల్లల్ని గురించి చెబుతున్నాడు. 'ఈ గృహమే స్వర్గసీమ' అని అందరు గృహస్థులూ అనుకో గలిగితే ఇక ప్రపంచంలో అశాంతి అనేదే వుండదు. మానవుడి ప్రయత్నమంతా మనశ్శాంతి కోసమే గదా! రాంమూర్తి భార్య కాఫీ కప్పులు పట్టుకొచ్చింది.

ఈ ప్రపంచంలో స్నేహాన్ని మించిన అనుబంధం మరోటి లేదనే బాపతు మనిషి సీతాపతి. చిరకాలపు స్నేహితుడి ఆతిథ్యం ఎంతో రమ్యంగా స్వీకరిస్తున్నాడు. ఎడారి బతుకులోంచి ఒక్కసారిగా జలాశయాలని చూచినట్లవుతోందతనికి. ఎక్కడో గదిలో కూచుని హోటల్లో నాలుగు మెతుకులు నంజి, కులాసాగా మాట్లాడు కుందుకు హృదయానికి హృదయం ఇచ్చే మిత్రులు నలుగురు దొరక్క శాంతి, మనశ్శాంతి

ఎట్లా దొరుకుతుంది తనకి? గృహ జీవనంలో ఉండే ఆనందాన్ని గురించి తనెన్నడూ ఆలోచించలేదు. ఇప్పుడిప్పుడు యేదో స్వప్న సీమలో విహరిస్తున్నట్లుంది. ఆనందమయమైన జీవితం కన్నా ఎవరికి మాత్రం వాంఛనీయమయిం దేమున్నది?

'ప్రతి ఆదివారం నువ్విక్కడికే వస్తూండాలి!' అన్నాడు రాంమూర్తి. పిల్లలు కూడా మరీ మరీ చెప్పారు. కాదనటం తన కెట్లా సాధ్యం? తొందర్లోనే సీతాపతికి ఆదివారాల్లో రాంమూర్తి ఇంటికి వెళుతూండటం అలవాటైపోయింది. పిల్లలు బాగా చనువైపోయారు కూడాను. వాళ్ళంటే తన కేమిటో అవ్యాజమైన ప్రేమ. తనిట్లా తలుపు తడతాడో లేదో, కిటికీలోంచి తొంగిచూచి తనేనని నిర్ధారణ చేసుకుని వాళ్ళంతా బిర బిరా పరుగెత్తు కొస్తారు మెట్లమీంచి. తన్మయం చెంది తన ఒళ్లో వాల్తారు. కాఫీ వేళకి మామయ్య దగ్గర నేను కూచుంటా నంటే నేను కూచుంటానని ఒకటే కీచులాట.

రాంమూర్తి జీవితంలో గడిచిన వివిధ స్థితులూ క్రమంగా తెలిసినాయి. అతననేక వృత్తు లవలంబించాడు; ఒక దాన్లోనూ స్థిరపడ లేదు. టీ కంపెనీ వ్యాపారం, సారా కంపెనీ మేనేజరూ, లిమిటెడ్ కంపెనీల సెక్రటరీ–ఇట్లానే అనేక పన్లు చేశాడు. చివరకు కొన్నాళ్లు జర్నలిస్టుగా కూడా పనిచేశాడు. ఇన్ని వృత్తుల్లోనూ విశేషానుభవం గడించాడు. ఎన్నో పుస్తకాలు చదివాడు. ఎన్నెన్నో కట్టుకథలు నించున్న పళాన చెబుతాడు. కుటుంబ భారమే అతన్ని ఇన్ని ఉద్యోగాల మీదికి దాడి చేయించింది. ఇప్పుడు చేస్తున్న ఉద్యోగానికి అంటి పెట్టుకునుండటానికి పిల్లల బాగూ పెళ్లాం బోధే ముఖ్యమైన కారణం.

✧ ✧ ✧

ఆదివారం రాంమూర్తి దంపతుల దగ్గర సెలవు తీసుకుని వెళుతూ బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు సీతాపతి. వానాకాలం. పగలల్లా తెరిపిలేని జల్లులు. చీకటిపడేసరికి వాతావరణం శీతలంగా తయారయింది. ఒక బస్సు ఆగకుండానే వెళ్లిపోయింది. ప్రతి పావుగంటకీ ఒకో బస్సు వెడుతోంది. పదిహేను నిమిషాలు బస్సు స్టాప్ దగ్గర ఆగటమంటే మాటలు కాదు. నిస్తబ్ధంగా జనం వంక చూశాడు కాసేపు. ఒక్కొక్క ఇంటి తలుపులూ మూతలు పడుతున్నాయి. కానీ రోడ్డు మీది జనం రద్దీ మాత్రం తగ్గటం లేదు. సీతాపతి బుర్ర స్నేహితుడి కుటుంబాన్ని గురించి సతమతమవుతోంది

హఠాత్తుగా గుండె ఆగినంత పని అయింది. దూరాన సుజాత కనిపించింది. కొన్ని మాసాలుగా తను సుజాత సంగతే మర్చిపోయినాడు. సుజాత రోడ్ క్రాస్

చేస్తూ రిక్షాలను తప్పించుకుందుకు రెండు మూడు నిమిషాలు అక్కడే నించుంది. సీతాపతి గుండె టకటక లాడుతోంది. సుజాత వైపు నడిచాడు. ఆమెతో మాట్లాడాలన్న అభిలాషతో కాదు; ఇంత రాత్రప్పుడు యెక్కడికి వెడుతోందో తెలుసుకుందామని. ఒక్కసారి సుజాత ముఖం కేసి చూడాలి–ఆమె నడవటంలోని విశేషం చూస్తే యెవరికోసమో ఆ ప్రాంతాల యెదురు చూస్తున్నట్లుంది. ఆ మనిషి యెవరై వుండొచ్చా అని సీతాపతి క్షణంసేపు దిగ్భ్రమ చెందాడు. సుజాత వెడుతున్న వేపుగా ఒక కుర్రాడు ముందు నడుస్తున్నాడు. సుజాత దబదబ నడుస్తూ అతన్ని దాటిపోతూ అతని వేపో వంకర చూపు విసిరింది, కొంత దూరం పోయి ఆగింది. అతను తనకు దగ్గరగా రాగానే నవ్వింది; అత నామె వేపు క్షణంసేపు చూచి తన దారిన తను పోయాడు. సీతాపతికి పరిస్థితి యీపత్తూ సుగ్రాహ్యమయింది; దిగ్భ్రమ చెందాడు. క్షణంపాటు తొందరగా నడిచి సుజాతని కలుసుకున్నాడు.

'సుజాతా–'

ఎవరా అని వెనక్కి తిరిగింది. ముఖం మాడిపోయి వుంటుందని సీతాపతి ఊహించాడు. కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు. సుజాత 'నిన్ను చూట్టం తమాషాగానే వుంది' అంది. ఏం జవాబు చెప్పాలో అతనికి తోచింది కాదు. మనసులో పెద్ద అంతర్నాటకం జరుగుతోంది. దాన్లోని పాత్రలకు యెంత న్యాయం చేకూరుతుందో అతనికి అర్థం కాదు. 'మొత్తానికి విచిత్రంగానే వుంది' అన్నాడు– దాదాపు స్వగతంగానే. సుజాత యేమీ అన్లేదు. ముఖం తిప్పి జనంవంక చూచింది.

'మనం యెటన్నా వెళ్ళి కాసేపు మాట్లాడుకుందామా?' అన్నాడు సీతాపతి.

'నన్నొంటరిగా ఒదిలెయ్ నాకు పనుంది'.

బహుశా ఆమెకు అర్జెంటుగా డబ్బేమైనా అవసరమేమో నన్న ఆలోచన కలిగి సీతాపతి అస్పష్టంగా 'నా దగ్గర అయిదు రూపాయిలున్నాయి' అన్నాడు.

'నువేమంటున్నావో నాకర్థం కావటమే లేదు. నేనిప్పుడే ఇంటికి పోతోతున్నాను. దార్లో నా స్నేహితురాలొకావిడ కలుస్తానంది? అందుకే చూస్తున్నాను'

'నీకు పుణ్యముంటుంది గాని సుజాతా, ఈ వేళప్పుడు అబద్ధం ఆడకు!' అన్నాడు సీతాపతి. కాసేపాగి సీతాపతి మళ్ళీ మొదటి ప్రశ్నే వేశాడు. 'మనం కాసేపు యెటన్నా వెళ్ళి మాట్లాడుకుందాం – నీ ఇంటిదాకా వెడదామా?'

'అమ్మో, మా ఇంటికే! అలా ప్రమాదం – పోనీ రేపు కలుస్తాలే'

సుజాత తప్పించుకుందుకు ఉపాయం చూస్తోందని సీతాపతికి రూఢిగా తెలుసు. ఎట్లాగయినా ఈమె నీ పూటకి ఒదిలెయ్యకూడదనుకొన్నాడు.

'ఉహు. లాభం లేదు. ఈ పూటకు మనం యెక్కడికొక్కడికి వెళ్ళక తప్పదు'.

'అయితే నాకు తెలిసిన గదొకటి వుంది పద. కాని అద్దెకింద రూపాయి వసూలు చేస్తారు'

'పోనీలే యెక్కడది?'

సుజాత గుర్తులు చెప్పింది. ఇద్దరూ జట్కాలో పడ్డారు. ఓ సందు మలుపు దగ్గర జట్కా ఆగింది. సుజాత 'ఇంటి ముందు దాకా జట్కాలో వెడితే వాళ్లకి కోపం వస్తుంది' అంది.

జట్కా యెక్కిం తరువాత వాళ్ళిద్దరిలో యెవరు గానీ మాట్లాడటం ఇదే ప్రథమం. కొంత దూరం ఆ సందులోకొచ్చి సుజాత ఒక ఇంటి తలుపు తట్టింది. తలుపు తొందరగానే తెరుచుకొంది. లావాటి ముసలావిడ ఇవతలికొచ్చింది. సీతాపతిని దీర్ఘంగా చూచి సుజాతతో రహస్యంగా యేమో మాట్లాడింది. సుజాత సీతాపతిని సందులోంచి వెనకవేపు గదిలోకి తీసుకెళ్ళింది. గాఢాంధకారం. సుజాత దీపం వెలిగించింది. సీతాపతి గది నోసారి కలియ జూచాడు. చిన్న పక్క సిగ్గుపడుతోనే పక్క చివర కూర్చున్నాడు. సుజాత ముఖం వేపు తేరిపార చూచాడు. ఇది వరకన్న చాలా చిక్కిపోయింది. సీతాపతికి యేం మాట్లాడాలో తోచటం లేదు. ఏమిటేమిటోగావుంది. ముఖాన్ని చేతుల్తో కప్పుకున్నాడు.

'ఎంత విచిత్రంగా వుంది' తనలో తాను అనుకొన్నాడు.

'ఇందులో గొణుక్కోవాల్సిందేమున్నది? నువింకా సంతృప్తి చెందావనుకుంటున్నాను'.

సీతాపతి జవాబు చెప్పలేదు. సుజాతకు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.
'నా కిదంతా ఇష్టంలేకనే చేస్తున్నా ననుకోకు'

'నాకు చాలా విచారంగా ఉంది'. ఇంతకన్నా సీతాపతికి వేరే మాటలు దొరకలేదు. ఏం మాట్లాడితే సుజాత పెడసరంగా అర్థం చేసుకుని కోపం తెచ్చిపెట్టుకుంటుందోనని భయం.

'నీ బేబీ యెక్కడ?'

'ఇంటిదగ్గరే వుంది. దాన్ని పోషించటానికి నా కిప్పుడు బహుకష్టంగా వుంది. ఎక్కడో మారుమూల గది తీసుకున్నాను. నాటకాల్లో వేషాలు వేస్తూంటానని చుట్టుపక్కల వాళ్ళకి చెప్పాను. ఆ మూలనించి ఇక్కడికి రావటమంటే అటోఇటో నాలుగు మైళ్లు'

'నువ్విది వరకు పని చేస్తున్న షాపు వాళ్ళు నిన్ను తీసుకోలేదా?'

'అక్కడే కాదు, ఇంకెక్కడైనా సరే నాకు ఇంకే పనీ దొరికింది కాదు. కాళ్ళకి బలపాలు కట్టుకు మరీ తిరుగుతున్నాను. ఆ మధ్య ఒకచోట చేరాను, వారం రోజులు సుస్తీగా వుండి పన్లోకి వెళ్ళకపోతే తీసేశామని కబురు చేశారు'

'ఇప్పుడు నువ్వు కులాసాగా వున్నట్టులేవు కదూ?'

'ఈ రాత్రి కూడా బయల్దేరే ఓపిక లేదు. కాని యేం చెయ్యను? అర్జెంటుగా డబ్బు కావాలి. నా స్నేహితుడి కొకడికి ఉత్తరం రాశాను. అతను జవాబేనా రాశాడు కాదు'.

'నువ్వు నాకు రాయాల్సింది'

'నేను కష్టాల్లో వున్నానని నీకు తెలీపర్చడం నా కిష్టం లేదు. నువు తీరా నేనీ కష్టాలకే తగుదునంటే నేనే గంగలో దూకాలి?'

'ఇప్పటి క్కూడా నువు నన్ను పూర్తిగా అర్థం చేసుకోలేదన్నమాట!'

ఒక క్షణంపాటు తను సుజాత మూలంగా పడిన గుంజాటనంతా నెమరుకు తెచ్చుకున్నాడు. అది కేవలం నెమరుకు తెచ్చుకోవటమే. ఆమె వేపు చూచి ఇక సుజాత తనను ప్రేమించటం లేదని ధ్రువపరచుకున్నాడు. ఆమెను చూస్తుంటే ఎంతో విచారమనిపిస్తోంది. అయితే తను ఈ మధ్య ఈ బాధాయుత వాతావరణం నించి ఇవతల పడివున్నందుకు తనని తను అభినందించుకున్నాడు. సుజాతని తల్చుకుంటే తనకు ఒకే ఆలోచన్లు.

'నువ్వు నిజంగా పెద్దమనిషివీ, మర్యాదస్తుడివీని. నేనింతవరకూ నీలాంటి వాడిని కల్చుకో నెరగను. అయితే నిన్నడగటమంటే నాకిష్టం లేదు... నువు నాకేమైనా ఇవ్వగలవా?'

'నా దగ్గర అయిదు రూపాయల నోటు ఉండటం మంచిదే అయిందన్న మాట' అంటూ అతనానోటు ఆవిడ కందించాడు.

'నా పరిస్థితి చక్కబడ్డాక ఈ బాకీ తీరుస్తానులే'

'ఆ విషయం ఇప్పట్నించే బెంగబెట్టుకోకు'

-తను చెప్పదల్చుకున్న దేదీ చెప్పటం లేదు సీతాపతి. అంతా సజావుగానే సహజంగానే జరిగిపోతున్నట్టు మాట్లాడుకుంటున్నా రిద్దరూ. ఆమె మళ్లీ తన కలుషిత వాతావరణంలోకి ప్రవేశించబోతోంది. సీతాపతి నివారించటం చేతకాక చూస్తూ కూచున్నాడు.

'నీ కాలాన్ని వ్యర్థపరుస్తున్నా ననుకుంటాను. నువు తొందరగా ఇంటికెళ్ళాలా?' అన్నది సుజాత.

'అబ్బే, నాకేం తొందరలేదు'.

'కాసేపు ప్రశాంతంగా కూచుందుకు అవకాశం చిక్కినందుకు నాకు చాలా సంతోషంగా వుంది'.

ఈ మాటలన్నీ సీతాపతి హృదయానికి సూటిగా గుచ్చుకున్నాయి. సుజాత విసుగుకొద్దీ కుర్చీలోకి వాలటం చూస్తే చాలా బాధగావున్నదతనికి. కాసేపిద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. సీతాపతి సిగరెట్టు ముట్టించాడు.

'నీవు నామనసుకు కష్టం కలిగించే మాటలనకపోవటంతో నాకెంతో సంతోషంగా వుంది సీతాపతీ. నువు నిష్ఠూరంగా మాట్లాడి నన్ను సిగ్గిలచేస్తావను కున్నాను'.

సుజాత మళ్లీ యేడుపు ముఖం పెట్టింది. ఆమెని మొదట భర్త వెళ్ళగొట్టినప్పుడు ఇలాంటి యేడుపు ముఖంతోటే తన దగ్గరికి వచ్చిందని సీతాపతికి ఛటాలున స్ఫురణకు వచ్చింది. ఆమె బాధల పునశ్చరణా తన నైతిక విధానం దిగజారటమూ ఎంతో కష్టం కలిగిస్తున్నాయి.

'నేనాస్థితిలోంచి ఇవతల పడగలిగితే బాగుండును. ఈ జీవితమంటే నాకెంతో అసహ్యంగా వుంది. ఈ జీవితానికి నేను సరిపడను. అసలు నా స్వభావం ఇది కాదు. దీన్నించి విముక్తి పొందేందుకు నేనేం చెయ్యమన్నా చేస్తాను. నేను చచ్చిపోయినా బాగుండును'.

దుఃఖంలో సుజాత పూర్తిగా చలించిపోయింది. హిస్టీరియా రోగిలాగ పూరికే యేడుస్తూ కూచుంది. ఒళ్ళంతా కంపించిపోతోంది.

'ఇదంతా ఏమిటో నీ కర్థం కాదు. ఎవరికి గానీ తమదాకా వస్తేగాని తెలీదు'.

సుజాత యేడుస్తోంటే చూస్తూ కూచోవటం సీతాపతికి చేతకావటం లేదు. ఆమె దుస్థితికి అతను చాలా జాలిపడుతున్నాడు. అతడెంతగా కదిలిపోయాడో తెలపటానికి మాటలు చాలవు. అకస్మాత్తుగా అతనికో ఆలోచన కలిగింది. దానితో అతనికి యెక్కడ లేని సంతోషమూ కలిగింది.

'చూడు సుజాతా, నువీ దుస్థితినుంచి విముక్తురాలి వవాలంటే నాకో చక్కని ఉపాయం తోస్తోంది. నేనిప్పుడు చాలా పొదుపుగా ఉంటున్నాను. నేనుండే ఇల్లు రెండు గదులది. నాకింత వుడకేసి పెట్టటానికీ ఇల్లు కాస్త శుభ్రంగా వుంచటానికీ ఒక మనిషికి నెలకు అయిదు రూపాయ లిస్తున్నాను. ఆ పని నువే చేసి పెట్టరాదా? నీ బేబీతో సహా నువ్వక్కడ వుండవచ్చు. ఇద్దరికయే ఖర్చుకన్నా ఒకడి ఖర్చు యేమీ తక్కువ కాదు. ఇక బేబీమాటా అది ఆలోచించనే అక్కర్లేదు'.

సుజాత యేడుపు దిగమింగి అతనివేపు నిశితంగా చూచింది. 'ఇంతగాథ జరిగాక కూడా నువు నన్ను ఇంటికి తీసుకెడతానంటావా?'

జవాబు యేం చెప్పటమా అని సీతాపతి కాసేపు ఆలోచించాడు. 'నువ్వు నన్ను విపరీతంగా అర్థం చేసుకోవద్దు. నీకింత తినతిండీ నిలవనీడా కల్పిస్తున్నాను; అది నాకే మంత ఖర్చుకింద రాదు కనుక ఇప్పుడు నాకు వంటచేసి పెడుతున్నావిడకన్నా నువేం యెక్కువ పనిచెయ్యాలని నాకు లేదు. నీ కామాత్రం పనిచేతనౌనని నాకు తెలుసు!'

ఆమె కుర్చీలోంచి లేచి అతనివేపు రాబోయింది.

'అనవసరంగా ఉద్రేక పడకు సుజాతా' అన్నాడతను ఆమెను వారిస్తూ. తనిట్లా ఎందుకు చేస్తున్నాడో అతనికి తెలీదు. సుజాత తనని ముట్టుకోవటం అంటే యెందుకో అతనికి గిట్టటం లేదు.

'నీకు కేవలం స్నేహితుడిలానే వుందామని నా అభిలాష!'

'నువు నా విషయంలో చాలా మంచివాడివి, చాలా మంచి వాడివి సీతాపతీ!'

'నీవు వస్తావన్న మాటేగా!'

'ఆఁ! ఈ దుస్థితి నుంచి విముక్తి అయేందుకు యేమైనా చేస్తానన్నానుగా! అయితే ఎప్పుడు రమ్మంటావు?'

'ఎప్పుడోనా? రేపే!'

అకస్మాత్తుగా ఆవిడ మళ్లీ కళ్ళనిండా నీళ్ళునింపుకుంది. 'మళ్లీ యేడుస్తావు దేనికీ!' అన్నాడు సీతాపతి నవ్వుతూ.

'నీకు నేను చాలా ఋణపడి వున్నాను. ఎట్లా తీర్చుకోగలనో అర్థం కాదు'

'అనవసరమైన విషయాలు ఆలోచించకు సుజాతా. ఇంక మనం ఇంటికి పోదామా!'

సీతాపతి తన అడ్రెసు రాసిస్తూ 'నువ్వు అయిదున్నరకి వచ్చేస్తే బాగుంటుంది' అన్నాడు. అతను చాలా దూరం వెళ్లాల్సి వుంది. కాని అతనికి కష్టం అనిపించటం లేదు. మనసంతా ఆలోచనల్తో నిండిపోయింది. గాలిలో తేలిపోతున్నట్లుంది.

✧ ✧ ✧

అదే పనిగా ఆలోచించేవాడికి కాలమానం అక్కర్లేదు. అసలు ఆలోచనల స్వరూపమే అంత! ఒక్కో ఆలోచన ఎక్కడ ప్రారంభం అవుతుందో కూడా చెప్పటం కష్టం. అది చెప్పగలిగినా అదే సరయిన జవాబు కాజాలదు. జీవితాలకు యెంత అంతర్గత చరిత్ర వుంటుందో, ఆలోచనలకూ అంతే! తత్త్వవిచారం చేసిన దగ్గర్నించీ దరీదాపూ లేని చింతనేకాని ఆశ్రయం దొరకదు.

సీతాపతి ఆలోచిస్తూ పేవ్‌మెంటు పక్కనే నడుస్తున్నాడు. సుజాత ఎవరు? తన జీవితంలో ఇంతవరకూ ప్రముఖపాత్ర అనక్కర్లేకపోయినా విశేషించి చెప్పుకోదగ్గ పాత్ర వహించిందీ, ఇక ముందూ పాలు పంచుకునేదీ అయిన సుజాతగురించి ఆలోచిస్తున్నాడు. తన జీవితాన్ని గురించి ఆలోచించాల్సిందేముంది? తనకు తెలిసిం దగ్గర్నించీ తనది ఒంటరి జీవితమే - దాదాపు యెడారి జీవితమే. ఆలనాపాలనా లేదు. ఏం చేసినా మంచీ చెడ్డా కనుక్కునే వాళ్లు లేరు. రోజులు బాధ్యతా రహితంగా దొర్లిపోతున్నాయి. తన ప్రమేయం లేకుండానే జరిగే పనికి కారణాలు అల్లటం మనకి చేతకాదు. మన ఊహలన్నీ పరిమితమే, క్లుప్తమే. తను తిన్నాడో పస్తున్నాడో కనుక్కునే వాడు లేడు. పేపరు చూచాడో చూల్లేదో విచారించేవాడు లేడు. సుఖానికీ దుఃఖానికీ పాలుపంచుకునే మరో ప్రాణి తక్కువ తనకు.

కొన్ని కొన్ని పరిస్థితులకు అతుక్కుపోయి మనం చేసే పనులు మనకే అర్థం కావు. ముందు క్షణంలో యేం చేస్తామో యెరగం. ఎన్నో ఆలోచిస్తాం, ఆశాసౌధాలనేవి సృష్టిస్తాం, కాని ఒక్కటీ నిలవదు. మనస్సుకు సంతోషం కలిగిస్తుందన్న పని చెయ్యటంలో విఫలులమై పోతాం, అంతే.

కొన్ని క్షణాల్లో మానసిక దౌర్బల్యం మనను కుంగదీస్తుంది. ఒళ్లు మైమరిచేట్టు చేసి చెయ్యరాని పన్లు చేయిస్తుంది. బుద్ధిమంతులమయితే కూడని పని చేసినందుకు తరవాతయినా పశ్చాత్తాప పడతాం. దురహంకార పూరితులమైతే కాదని బోకరిస్తాం. మనసులో ఎంతో సంఘర్షణ రేగుతున్నా పైకి మాత్రం – నేను చేసిందే రైటు–నాదే సరయిన దృక్పథం అంటాం. దీన్ని దౌర్బల్యంగా మనం భస్తే ఒప్పుకోము.

సీతాపతికి ఇదే సమస్య. ఒళ్లు తెలీక చేశాడు. ఫలితం జీవితాలమీద యెంతగా ప్రసరిస్తుందో అప్పుడు తెలీదు. ప్రపంచం కనిపించకుండా కళ్ళు మూసుకు పోతాయి గావును.

ఆర్నెల్ల కిందటి సంగతి – బజార్లో బట్టల దుకాణంలో చూచాడు – ఒక రోజున సుజాతని. లోపలికెళ్ళి గంటసేపు బేరం చేశాడు సుజాతతో. ఒక్క గుడ్డ ముక్కా కొన్లేదు, శుష్కప్రియాలేగాని.. సుజాత యెంత నిర్లక్ష్యంగా జవాబు చెప్పిందీ? అవును మరి తనకు ఇదే విచిత్రం కావచ్చుకాని, కొట్లో పనిచేసే సుజాతకి తనలాంటి వెర్రి అబ్బాయిలు లక్షోపలక్షలు! మాటలసందులోనే నవ్వేవాడు. ఏదో సందేశాన్ని అందించేందుకు ప్రయత్నించేవాడు, నసిగేవాడు, యేమేమో చేసేవాడు. సుజాతను ఆనాడు మనసారా ప్రేమించాడు. కావాలంటే పాదాక్రాంతం అయేందుకూ సిద్ధపడ్డాడు. కాని ప్రేమను త్రోసి రాజనేందుకు సుజాత సాహసించింది. ఎన్నోసార్లు తన వెంట షికారుకు తీసుకువెళ్ళాడు. ఎన్నో రకాలుగా తన ప్రేమను వ్యక్తపరిచాడు. ఉహూ సుజాత ఒప్పుకోలేదు. జీవితంలో ఆత్మహత్యకన్నా మార్గాంతరం దొరకలేదు సీతాపతికి! వెర్రివాడు!!

ఇంతటితో ఈ అనుబంధం ఒదిలిపోతే సీతాపతి బుర్ర ఇంత బాధపడవలసిన అవసరం లేదు. సుజాత ఒకనాడు యేడుస్తూ తయారయింది. సీతాపతికి అమిత జాలి, సానుభూతీని!

'ఏమిటి సుజాతా!'

'నా బతుకిట్లా అవుతుందని కలలో కూడా అనుకోలేదు'. ఏడుస్తూ జవాబు చెబుతోంది. సీతాపతికి తోచదు. సుజాత అంటే ఎంతో అయిష్టం కొని తెచ్చు కున్నప్పటికీ, ఆమె యేడుస్తూంటే చూస్తూ పూరుకోటం అతనికి అసాధ్యమైన పని! సుజాతని ఊరడించటం ఎట్లాగో తెలీదు. తన దురవస్థ అతనికి విశదంగా చెప్పగలగటం కూడా ఆమెకు సాధ్యం కావటం లేదు. మేఘాలను తరిమే గాలిలాగా దుఃఖం –

వాక్కును తరుముతోంది. ఎట్టకేలకు తెలుసుకున్నాడు - ఈ దుఃఖం యెవరూ తొలగించలేనిదని.

సుజాతని భర్త వెళ్ళగొట్టాట్ట. అనరాని మాటలూ అన్నాట్ట. ఇక ఆ ప్రాపున వుండటం తనకు సాధ్యం కాదని సుజాత విలపిస్తోంది.

'భార్యను నిర్లక్ష్యం చెయ్యటానికి ఈ రోజుల్లో భర్తకు హక్కులేదు సుజాతా! నువ్వట్టే దిగులుపడకు, తొందర్లోనే వెలుగు కనిపిస్తుంది'.

'నీ కింకా తెలీలేదు సీతాపతీ. అతను నన్ను చేసుకున్న భర్త కాదు. కేవలం కలిసి వుంటున్నాం అంతే! అతను నన్ను కాదంటే నేను చెయ్యగలిగిందేమీ లేదు'.

సీతాపతి నిస్తబ్దుడయ్యాడు. ఒక్కొక్కళ్ళ జీవితాలు మంత్రగాడి చేతిలో కర్రల్లా ఎన్ని వంకర్లు తిరుగుతున్నాయి. సెక్యూరిటీ లేని జీవితాలు బాధలనీ భయాలనీ అవినీతినీ దుర్మార్గాన్నీ కలిసికట్టుగా తెచ్చే జీవితాలు- ఇవే మనం అనుభవిస్తున్నాం. దాన్లోనే ఆనందిస్తున్నాం. సందుల్లో పందులం మనం, మనుషులం కాము. మానవత్వం మనలో అణుమాత్రమైనా లేదు.

సుజాతను తను యెంతగాఢంగానో ప్రేమించాడు. ఆమె ఇష్టపడితే అర్ధాంగిగా సైతం చేసుకుందామనుకున్నాడు. లైంగిక సుఖం కోసం తన నవనాడులూ కృశించినై. లైంగికానందంతో తనని బందీ చేసిన సంకెళ్ళని తెంచేసుకుందామనుకున్నాడు. కానీ, సుజాత కలిసి రాలేదు. తననో పురుగులా చూచింది ఈ విషయంలో. తన ప్రేమంతా మోడువారిపోయినట్లయింది. తనకు ఆత్మహత్యకంటే అనువయిన మార్గం లేదని విలపిస్తోంది సుజాత!

'ఒద్దు సుజాతా. ఆ మాట తలపెట్టకు. చచ్చి సాధించేదేమీ లేదు. బతికుంటే ఈ ప్రపంచం లోతు పాతులు తెల్సుకుందుకు ప్రయత్నించవచ్చు గదా!' అన్నాడు తను.

సుజాతను ఎలాగో ఒప్పించాడు. 'నువు వేరే వుండు. ఉద్యోగం చేసుకుంటున్నావు. అధైర్యపడొచ్చా?'

'ఈ ఉద్యోగం నేనింకెంతో కాలం చెయ్యలేను' సిగ్గుతో తల వంచుకుంది సుజాత. అర్థం కాలేదు సీతాపతికి. ఏ స్త్రీ మాత్రం 'నేనిప్పుడు గర్భవతిని, నాకిప్పుడు అయిదో నెల' అని ధైర్యంగా చెప్పగలుగుతుందీ? సీతాపతి క్షణం పాటు సంతోషించాడు. 'ఫరవాలేదు సుజాతా, ఇప్పుడు నా సంపాదన మెరుగ్గానే వుంది. నీ

పోషణ వ్యయం కూడా భరిస్తూంటాన్లే ఏమీ బెంగ పెట్టుకోకు. ధైర్యంగా వుండు. వుంటానని నాకు మాట యియ్యి' అన్నాడు తను. తన కేమిటంత మమకారం? తన ప్రేమని గుడ్డి గవ్వంత విలువయినా చెయ్యకుండా ఒదిలిన సుజాతంటే, తనకీ సానుభూతి ఎందుకు? ఎందుకో అతని కర్థం కాదు.

సుజాతకు ఆడపిల్ల కలిగింది. సీతాపతి అడపా దడపా వెదుతూంటాడు. ఈ మధ్య మరీ మర్చిపోయేందుకు ప్రయత్నించాడు. రెండు మాసాలయింది సుజాతని చూచి. మళ్ళీకొన్నాళ్ళపాటు సుజాతతో అనుబంధం ఏర్పడబోతోంది, ఏమి జరుగుతుందో ఊహించటం ఎవరికి మాత్రం సాధ్యం అయిన విషయమా?

✧ ✧ ✧

సీతాపతి మరునాడు అయిదింటికే లేచి కూర్చున్నాడు. తనకున్న రెండు గదులనూ సర్దాడు. ఒక గది సుజాతకు ఇవ్వటానికి సిద్ధం చేశాడు. తనకి వంటచేసి పెడుతున్నావిడతో ఇక పనికి రానక్కర్లేదని చెప్పేశాడు. సరీగా ఆరింటికి ఇంటిముందు రిక్షా ఆగింది. సుజాతే వచ్చింది. సామాను లోపలికి తెచ్చేందుకు సాయం చేదామని సీతాపతి బయటికి వచ్చాడు. పెద్ద సామానేమీలేదు; చిన్న చిన్న మూటలు రెండు మూడున్నాయి. పిల్లను చంక నేసుకుని సుజాత ఇంట్లో కొచ్చింది. 'నేనీ ప్రాంతాలకి యెప్పుడూ రాలేదు'.

సీతాపతి తన గదులు ఆమెకి చూపాడు. సుజాత తన పాపను చూపుతూ 'నువ్వు దీన్ని గుర్తుపట్టలేవనుకుంటాను?'

'అవును ఈ మధ్య అటువచ్చి చాలా కాలం అయింది గదూ మరి!'

'దీన్ని ఎక్కడ పడుకో బెట్టను?'

"అరరె! నా దగ్గర ఉయ్యాల లేదే!"

'ఉయ్యాలే అక్కర్లేదు. ·దీనికి నా దగ్గర పడుకోవటమే అలవాటు!' అంటూ సుజాత బిడ్డను పడక్కుర్చీలో పడుకోబెట్టి తీరుబడిగా గదంతా కలయ జూచింది. ఒకమూల సీతాపతి తైల చిత్రం గోడకు వేలాడుతోంది. ఈ చిత్రం సీతాపతికి ఒక మిత్రుడు రాసిపెట్టాడు. సుజాత దాన్ని పరికించి 'ఉహూ–కొన్ని కోణాల్లో బాగుంది, మరికొన్ని కోణాల్లో బాగులేదు. దీనికన్నా నువ్వే బాగున్నావు' అంది.

'నేను బాగున్నానన్న సంగతిని ఇంతకుముందెప్పుడూ చెప్పలేదే నువ్వు'

'ఒక మనిషి ఆకారానికి బాగున్నాడా లేదా అనే విషయం నేనింత మథనపడి ఆలోచించను. చూపులకు బాగుండే వాళ్లు మోసాన్ని జీర్ణించుకొనుంటారు. నా అనుభవంలో అంతే!'

అద్దంకోసం ఆమె కళ్ళు గదినంతా వెదికాయి. కాని లాభం లేకపోయింది. చిందర వందరగా వున్న జుట్టు సవరించి ముడివేసుకుంటూ 'నే నిక్కడ ఉండటాన్ని గురించి ఇంటివాళ్ళు ఏమనుకుంటారో?'

'ఇంటివాళ్ళు మటుకు యెంత మందున్నారు? మొగుడూ, పెళ్లాం ఇద్దరే! అతను పగలల్లా ఇంటిలో వుండనే వుండడు. ఆవిడనైనా నేను నెలకో సారి అద్దె యిస్తున్నప్పుడు తప్ప చూడను. నేనిక్కడ కొచ్చింతర్వాత వాళ్లతో ఒక్కసారేనా మాట్లాడి యెరుగను'.

సుజాత అవతలి గదిలోకి వెళ్లిపోయింది. సీతాపతి పుస్తకం ముందు వేసుక్కూర్చున్నాడు. ధ్యాస నిలవటం లేదు. సిగరెట్టు ముట్టించాడు.

నిద్రపోతున్న పాపవైపు నవ్వుతూ చూచాడు. మనసులో సంతోషం ఉబికింది. సుజాతను తాను ప్రేమించటం లేదన్నమాట రూఢి; ఆ భావం తనలో పూర్తిగా అంతరించి పోయింది. సందేహం లేదు. తన శరీరం అందుకు తిరస్కరిస్తోంది. సుజాతను కౌగిలించుకొన్నా తనకు ఆనందం ఉండదు.

సుజాత తలుపు తోసుకొని ఇవతలకు వచ్చింది. 'రాజసౌధం అంతా తిలకించావా?'

'ఇంత చిన్నవంటయిల్లు నేనెక్కడా చూళ్ళేదు'.

'మన వంటకి ఇది చాలా ఎక్కువ'.

'పదార్థాలేమీ వున్నట్టు లేవు, బజారుకు వెళ్లి పట్టుకొస్తాను'.

'సుజాతా, మళ్లీ హెచ్చరిస్తున్నాను. మనం చాలా పొదుపుగా వుండాలి'. సీతాపతి ఆమె చేతికి కొంత డబ్బు యిచ్చాడు. సుజాత బజారుకు వెళ్ళి అరగంటలో తిరిగొచ్చింది.

వంట అయిన తరువాత సీతాపతి లోపలికి వెళ్లాడు.

'ఏం సుజాతా, ఒకటే విస్తరివేశావు. నువ్వు తినవా?'

'నీతోపాటు కూర్చుంటే నువేమన్నా అనుకుంటావేమోనని వూరుకున్నాను'.

'ఏమనుకుంటాను? ఎందు కనుకుంటాను?'

'నేను కేవలం పనిమనిషినే కద!'

'తెలివి తక్కువగా మాట్లాడకు సుజాతా!' అంటూ సీతాపతి నవ్వాడు. ఆమె భావం అతని హృదయంలో మెలిక వేసుక్కూర్చుంది. సుజాతతో తన పూర్వ సంబంధం గుర్తుకొచ్చి ఒక్క క్షణం ఆగాడు. తరువాత 'నీ కేదో మహోపకారం చేస్తున్నా ననుకోకు. నీ పనికి ప్రత్యామ్నాయంగా నిలవ నీడా, తిన తిండీ ఇస్తున్నాను. నువు నాకేం ఋణపడి లేవు. ఇందులో నువు సిగ్గుపడాల్సింది కూడా ఏమీ లేదు'.

సుజాత జవాబు చెప్పలేదు కాని ఆమె చెంపల వెంట కన్నీటి ధార బయల్దేరింది. ఈ తరగతి అబలలు పనిని నీచంగానూ చెయ్యరానిదిగానూ భావిస్తారనీ, శ్రమగౌరవం వాళ్లకు తెలీదనీ సీతాపతి అనుకున్నాడు. అతనికి కొద్దిగా చిరాకనిపించింది కూడాను, కాని సుజాత ఆరోగ్యం బహు నీరసస్థాయితో వున్నదని తెల్సి కూడా తనిల్లా ప్రవర్తించటం తప్పని తనని తాను నిందించుకున్నాడు.

భోజనానంతరం సీతాపతి ఇవతలిగదిలో కూచుని సిగరెట్టు ముట్టించాడు. అవతలి గదిలో యెవరో తిరుగాడుతూండటం ఇంటికి నూత్నశోభ తెచ్చినట్లేవుంది. సీతాపతిని ఇంత కాలం ఒంటరితనం మహా కుంగదీసింది. సుజాత అలికిడి అవుతుంటేనూ, గాజులు గలగల్లాడుతుంటేనూ అతని హృదయం సంతోష తరంగిత మవుతోంది. సుజాత ఇవతలి గదిలో కొచ్చింది. సీతాపతి ఓరకంట చూచాడు. ఒళ్లు గగుర్పొడిచి నట్లయింది. తనేదో భావోద్రిక్తుడవుతున్నట్లు సుజాత గ్రహిస్తే యెంత ప్రమాదం? ఆమెకిక ఆత్మశాంతి కలిగించటం తనకు సాధ్యపడక పోవచ్చును.

'ఆ గది నీ కనుకూలంగానే వుండనుకుంటాను. యేదీ ఈ రాత్రి పూర్తిగా నిద్రపోతేగాని నీకీ ఇంటి సంగతి యిదమిత్థంగా తెలీదు'.

'నువ్వు రాత్రి చాలాసేపు మేల్కొంటావా?'

'దాదాపు పదకొండింటి దాకా చదువుకొంటుంటాను'.

◇ ◇ ◇

మర్నాడు మంగళవారం. సీతాపతి యథాప్రకారం నాలుగు మెతుకులు ముక్కూ నోటా కొట్టుకుని తన దారిన తాను పోయాడు. సుజాతతో మాట్లాడేందు కతనికి తీరిక చిక్కింది కాదు. సాయంకాలం అతను ఇంటికి వచ్చేటప్పటికి ఆమె కిటికీ దగ్గర కూచుని యేవిటో ఆలోచిస్తోంది. 'ఇవాళంతా యెట్లా గడిపావు సుజాతా?' అనడిగాడు సీతాపతి నవ్వుతూ.

'ఇల్లంతా శుభ్రం చేశాను. బేబీని ఆడించాను'.

సీతాపతి నేలమీద దొర్లుతూన్న పాపకేసి లాలనగా చూచాడు. సుడిబడి బజారునించి రాగానే ఇంటిదగ్గర దివ్యమూర్తుల్లా తల్లీ పిల్లా కనిపిస్తే కంటికి ఇంపుగా వుండి హృదయం యెంత ప్రశాంతమవుతుందో అతనికి ఇప్పుడే అర్థమయింది. 'అన్నట్లు సుజాతా, నీరసం పోవటానికి నేనో మంచి మందు పట్టుకొచ్చాను. రోజూ భోజనానంతరం వాడాలి. నీ ఒళ్లు మళ్లీ ఇదివరలాగా అవుతేగాని లాభం లేదు' అన్నాడు.

'నా కిప్పుడు నెమ్మదిగానే వుందిలే' అంది సుజాత నీరసంగానే.

ప్రతిమంగళవారం రాత్రీ, సీతాపతికి రఘు దగ్గరికెళ్లి బాతాఖానీ కొట్టడం అలవాటు. సరీగా సుజాత తన దగ్గరికి వచ్చిన మరునాడే, మంగళవారం కావటం తన దురదృష్టమే ననుకుంటూండగా సుజాతే అడిగింది 'యెక్కడికేనా వెళ్లాలా' అని.

'ఊఁ, ఈ రాత్రంతా వేరేచోట పనుంది. మళ్ళీ తెల్లవారుజామునే వస్తాను'.

ఈ మహానగరంలో వుంటున్న మేధావు లెందరో రఘు దగ్గరికి వస్తూంటారు; ఎన్నెన్నో ప్రముఖ విషయాలు చర్చిస్తుంటారు. గత మంగళవారం తను వెళ్లడం యెంచాతో పడింది కాదు. అందువల్ల తనకు వచ్చిన నష్టం విలువ అయిదు వందలన్నా వుంటుందని రఘు చెప్పే సరికి, సీతాపతి భగ్న హృదయుడైపోయాడు. 'మరి నా కెందుకు కబురు చేశావు కాదు?'. ధర అకస్మాత్తుగా తగ్గటానికి యెవరూ ముందుగా చెప్పలేరు. రఘు సమాధానం సంతృప్తికరంగా లేదు అయినా సీతాపతి చెయ్యగలిగిందేమీ లేదు. ఏమైనా తన దురదృష్టానికి తనే నిందించుకుంటూ సీతాపతి 'ఈ సారి అలాంటి లాభసాటి బేరం తగిలినప్పుడు నాకు టెలిగ్రాం ఇచ్చెయ్యి. నా తరుపున సరుకు ఖరీదుచేసి నాకు తెలీపర్చు' అన్నాడు. ఒక బేరం పడిపోయినందుకు సీతాపతికి అసూయగానే వుంది. ఈసారి తప్పకుండా టెలిగ్రాం యిస్తానని మరీ మరీ మాట తీసుకుని సీతాపతి దాదాపు ఒంటి గంటన్నరకి ఇంటిముఖం పట్టాడు. అతనింటికి చేరుకునేసరికి సుజాత ఇంకా వాలుకుర్చీలోనే ఉంది.

'ఏమిటి నువ్వు పడుకోలేదేం?'

'నాకు నిద్రరావటం లేదు'

'నిద్ర రాకపోయినా సరే, పక్కమీద పడుకుంటే కొంత విశ్రాంతి చేకూరుతుంది'.

సుజాత కదల్లేదు. 'నీకేమైనా కావలసి ఉంటుందేమోనని, నువ్వొచ్చేంత వరకూ మేల్కొందామనుకున్నాను'.

సీతాపతి ఆవిడవేపు చూచాడు. ఆమె పెదిమలమీద చిరునవ్వు తొలకరించింది. పరిస్థితి తనకంతా అగమ్య గోచరంగా ఉన్నట్లుందతనికి.

'మంచిపనే చేశావు. బాగుంది కానీ ఇకనైనా వెళ్లి పడుకో. లేకపోతే రేప్పొద్దున్నే లేవటం ఆలస్యం అవుతుంది'.

'పక్కమీదికెళ్ళి పడుకో బుద్ధికావటమే లేదు'.

'అదేమిటీ' అన్నాడు సీతాపతి మెల్లిగా. అయిష్టంగానే లేచి సుజాత తన గదిలోకి వెళ్ళింది. అవతలివేపు గట్టిగా తలుపు ఘడియవేయటం విని సీతాపతి తనలో తాను నవ్వుకున్నాడు.

తరువాత కొద్ది రోజులు చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేకుండానే జరిగిపోయాయి. సుజాత ఈ వాతావరణానికి అతుక్కుపోయింది. ఇంటావిడతో ఒకసారి మాట్లాడి సీతాపతి సంవత్సరం పాటు ఇక్కడే వుంటూ తెల్సుకోలేని సంగతులెన్నో తెల్సుకుంది.

'ఇంటావిడ చాలా మంచిది. నేనామెతో మనిద్దరికీ పెళ్ళయిందని చెప్పాను'.

'అట్లా చెప్పుకోవటం అవసరమంటావా?'

'ఆమెతో యేదో ఒకటి చెప్పాల్సి వుండె. మరి మనిద్దరిమధ్యా వైవాహిక సంబంధం లేకుండా నేనిక్కడ వుండటం అంటే హాస్యాస్పదం కదా మరి! నన్ను గురించి ఆమె ఏమనుకుంటుందో నా కర్థం కాదు'.

'నువ్వు చెప్పినమాట ఆమె నమ్మి వుంటుందన్న నమ్మకం నాకు లేదు'.

'టేటీ మూలంగా మన పెళ్లి రెండు సంవత్సరాల క్రితమే అయిందని చెప్పాల్సి వచ్చింది' అన్నది సుజాత.

'ఇదంతా యేదో కట్టుకథలాగుంది'. కాకమ్మ కబుర్లు పోగుచేసి చెప్పటంలో ఆమెకున్న శక్తిని సీతాపతి యేవగించుకున్నాడు. కాని చేసేదేముంది? జరగాల్సిందేదో జరిగేపోయింది. గతాన్ని సరిదిద్దటానికి యెవరికీ శక్తిలేదు.

ఆ సాయంత్రం బహు మనోహరంగా వుంది. నగరంలోని ప్రజలంతా బజార్లోకి కుమ్మరించబడ్డట్టు రోడ్లన్నీ జనాశ్రితమై పోయాయి. సుజాత కిటికీ దగ్గర నించుని బజార్నపోయే జనాన్ని పరికిస్తోంది. కేకలు వేసుకుంటూ ఉత్సాహం ఉరకలు

వేస్తూండగా, అనేక పన్లమీద వెళ్లే జనాన్ని చూచి ఆమె మౌనంగా యేమి భావిస్తూందో యెవరికి తెలుస్తుంది?

సుజాత హఠాత్తుగా వెనక్కి తిరిగి 'ఈ రాత్రి నీకేమైనా పనుందా సీతాపతీ?' అనడిగింది.

'ఉంది, యేం? ఎందుకూ? వేరే పనేమైనా వుందా?'

'మరేం లేదు. కాస్తహాయిగా బజార్లో తిరుగుదామని వుంది. మరేం లేదు వెడదామా?'

'తప్పకుండా వెడదాం సుజాతా!'

'అయితే వుండు. ఇప్పుడే వస్తాను' అంటూ సుజాత లోపలి గదిలోకి వెళ్ళింది. బహుశా చీర సర్దుకోటానికై వుంటుంది!

ఈ మనోహరమైన రాత్రి ఇంటి నాలుగు గోడల మధ్య మురికి కూపంలో వున్నట్లు ఉంటానికి యెవరికీ ఇష్టం వుండదు. పోతే సుజాత కూతురు నిద్రపోతోంది. అట్లా నిద్రపోతూనే ఉంటుందని తనెక్కడికయినా వెళ్ళినా మేలుకోదనీ సుజాత అన్నది. సుజాత ఇప్పుడెంతో ఉల్లాసంగా కనిపిస్తోంది. ఈ ఉల్లాసం సీతాపతికి కూడా అంటువ్యాధిలా తగిలింది. ఆమెను ఇంతకాలం తనెందుకు ఉపేక్షాభావంతో చూచాడో అతని కర్థంకాదు. గాలిలోకి రాగానే సుజాత, మందహాసం చేసింది. ఇద్దరూ యెదురుగా వచ్చిన ట్రాం యెక్కారు. షాపులన్నీ విద్యుత్కాంతికి ధగధగ మెరుస్తున్నాయి. మహాజనం మరునాటికి కావల్సిన సరంజామా బేరం చేస్తోంది. దారిలో సంగీతశాల బోర్డు కనిపించింది. సుజాత 'నేను సంగీతం విని యెన్నో రోజులయింది సుమా!' అంది. సీతాపతి 'అయితే పద వెళదాం' అన్నాడు. ఇద్దరూ ట్రాం దిగి పది గజాలు నడిచి సంగీతశాల చేరుకున్నారు. సుజాత కళ్ళు మిలమిల మెరిశాయి. సంగీత సారాన్ని ఆమె మనసారా గ్రోలుతోంది. ఇంకా సుజాత సీతాపతికి సమస్యగానే మిగిలిపోయింది. ఆమెను గురించి నిశితమైన అభిప్రాయానికి రాలేక పోతున్నాడు. ఆమెలోని కొన్ని గుణాలకు అతనెంతో పొంగిపోతున్నాడు. ఆమెలో చాలా మంచివున్నదనటంలో సందేహం లేదు. ఆమె పెరిగిన వాతావరణం మంచిది కాకపోవచ్చు. జీవితం ఆమెను చాలా అన్యాయం చేసింది. ఆమె శక్తికతీతమైన సుగుణాలను ఆమెలో తను ఆశిస్తే అది కేవలం సాహసమే అవుతుంది. వివిధ దృక్పథాల నుంచీ ఆమెను పరిశీలిస్తే కుంచితనమే గోచరిస్తుంది. జీవితమనే మహోదధిని ఈదటానికి ఆమె పనికిరాదు.

ఇప్పుడు సుజాతని చూస్తుంటే యెంతో ఆత్మీయతా ఆప్యాయతా కలుగుతున్నాయి. తన కామె కలిగించిన సంక్షోభానికి మనసులో క్షమాపణ చెప్పుకున్నాడు సీతాపతి. బాగా తోచక వెళ్ళిపోదామని సూచిస్తే సుజాత 'బాగుంది, చివరంటా విని మరీ పోదాం' అని ప్రాధేయపడ్డట్టుగా అంది. సరేనన్నాడు. మిగతా కార్యక్రమ మంతా సీతాపతి సుజాత చెయ్యిపట్టుకునే వున్నాడు. ప్రోగ్రాం అయిపోయాక నేరుగా ఇంటికెళ్ళటానికి మారు కాసేపు ఆ బజార్నే పచారు చేశారు.

'ఎన్నో నెలలయింది నేనిట్లా కులాసాగా గడిపి' అంది సుజాత. సీతాపతి పూర్ణ హృదయంతో సుజాతను అభినందిస్తూ తల్లినీ పిల్లనీ తన దగ్గరికే తెచ్చి ఉంచుకోవాలనే సదుద్దేశం కలిగించిన విధికి కృతజ్ఞత తెలిపాడు. చిట్ట చివరకు ఇద్దరూ అలిసి సొలిసి ఇంటివైపుకు నడిచారు. సుజాత సీతాపతి బుజం మీద చెయ్యివేసి పూర్వపురోజులు గుర్తుకొస్తున్నాయంది. సుజాత తనని నిర్లక్ష్యం చేసిన రోజుల్లో తను ఆత్మహత్య చేసుకుందామనుకోవటమూ, ఇంకెన్నో మనోవికారాలకు లోనవటమూ జ్ఞాపకం వచ్చింది సీతాపతికి. ఈ గాథంతా యెన్నో యుగాలకిందట జరిగినట్లుంది. తన పూర్వ స్వభావానికి తనకే నవ్వొచ్చింది.

ఇల్లు చేరుకున్నారు. 'పాప నిద్ర లేవనట్టేనా?' అనడిగాడు సీతాపతి. సుజాత లోపలి కెళ్ళి వచ్చి 'పడుకున్నది పడుకున్నట్టే వుంది. అంగులం మేరేనా కదల్లేదు' అంది. సీతాపతి క్షణంసేపు ఆశ్చర్యపోయి 'సరే ఇక వెళ్ళి పడుకో' అన్నాడు.

'అప్పుడే పడుకుంటావా?'

'అప్పుడే యేమిటి? ఒంటి గంటన్నర! ఈ రోజుల్లో ఈ మాత్రమయినా నిద్ర లేకపోతే బహు ప్రమాదం'.

'సీతాపతీ, ఆ రోజు నువ్వు నన్ను పాపతో సహా ఇక్కడ కొచ్చి వుండమంటే నీ ఉద్దేశ్యం ఏమిటో నాకు బోధపడలేదు. కేవలం నీకింత ఉడకేసి పెట్టి ఇల్లు శుభ్రంగా ఉంచితే చాలన్నావు'

'అయితే నీకింక బోధపడనే లేదన్నమాట!'

'ఊహు–'

'నాకు తెల్సులే' సీతాపతి నవ్వుతూ జవాబు చెప్పాడు. ఆ మాటను నేను గంభీరంగానే అన్నాను. మరోషరతు మీద అయితే నిన్నిక్కడ వుండ నిచ్చే వాడినే కాను'

'ఎందుకని?'

'నాకట్లానే అనిపిస్తోంది; విశదంగా చెప్పటం నా తరం కాదు'

సుజాత బుజాలు కుదించుకుంది. 'సరే కానీ; నీ ఇష్టం వచ్చినట్లే. నేను అందుకోసమే తాపత్రయపడి దిగజారి పోయేరకం కాదు' అంటూ సుజాత తన గదిలోకి వెళ్ళిపోయింది.

✧ ✧ ✧

మర్నాడుదయం సుజాత విసుగ్గా వుంది. భోజనం దగ్గర బహు నిశ్శబ్దంగా ఉంది.

'నువ్వు భోంచెయ్యవా?' అన్నాడు సీతాపతి ఒకటే విస్తరి చూచి.

'తలనొప్పిగా ఉంది. తర్వాత చేస్తాను' అంది. సీతాపతి అంత పట్టించుకోలేదు. పగలల్లా అతనికి ఎక్కడో గడిచిపోయింది. కాని రాత్రి కూడా ఇంతే జరిగింది. సీతాపతి లేని నవ్వు తెచ్చిపెట్టుకుని 'నువెట్లాగయినా చాలా నిశ్శబ్దంగా వున్నావు సుమా' అన్నాడు.

'నే నిక్కడ వండటానికీ ఇల్లు శుభ్రంగా ఉంచటానికే ఉన్నాను. నేను మాట్లాట్టం కూడా అవసరం అని అనుకోటం లేదు' అంది సుజాత. గొప్ప చిక్కులో పడ్డట్టయింది సీతాపతికి. కాని ఇద్దరూ ఒకేచోట ప్రశాంతంగా వుండాలంటే అందుకు తను కొంత ప్రయత్నం కూడా చేసి తీరాలి.

' రాత్రి సంగతే నిన్నింకా బాధిస్తోందను కుంటాను' అడగడానికి ఇది చచ్చు ప్రశ్నే కావచ్చు కాని ఇంతకన్నా తేలిక మార్గం సీతాపతికి తోచనే తోచలేదు.

'నీ ఉద్దేశం నాకు బోధపడటం లేదు'.

'నీకు కోపం రాకుండా వుంటే చెబుతాను. నువ్వు ఇక్కడికి వచ్చి ఉండటం అనేది మనమిద్దరం స్నేహితులమన్న భావనమీదేనని నా ఉద్దేశ్యం. మరోటయితే ఇలా జరిగేదే కాదు. నీకు కాస్త ఆశ్రయం కల్పించి నీ దారి నువ్వు చూసుకునేట్టు చెయ్యటమే నా ఆశయం' అన్నాడు సీతాపతి. సుజాతకు కోపం రాలేదు. కానీ ఆశ్చర్య చకితురాలయింది. సీతాపతి ఉద్దేశ్యం నిశితంగా అర్థం కావటం లేదు. పరిస్థితులు పూర్తిగా తెలుసు. వాటికి అనుగుణంగానే అతను నడుస్తున్నాడా? ఇందుకు తను సంతోషించక తప్పదు.

ఇద్దరికీ రోజులు సజావుగానే దొర్లిపోతున్నాయి. పగలల్లా సాధారణంగా సీతాపతి యెటో వెళ్ళిపోతూండేవాడు. సుజాతకు ఇల్లు బాగా అలవాటయింది. ఎప్పుడో

తరచుగా ఇద్దరూ సంగీత ప్రదర్శనలకు వెళ్ళివస్తూండేవారు. సుజాతను తను పోషిస్తున్నందుకు చెయ్యగల ప్రత్యుపకారం తన కింత ఉడకేసిపెట్టి, ఇల్లు శుభ్రంగా ఉంచితే చాలని సీతాపతి ఇంకా నమ్ముతూనే ఉన్నాడు. ఈ యెండాకాలంలో యెక్కడేనా పని దొరుకుతుందేమోనని వెదకటం కూడా తెలివితక్కువగానే భావించింది సుజాత. శీతాకాలం వరకూ ఆమెనిక్కడే వుండమని సీతాపతి చెప్పేశాడు. సుజాత తీరిగ్గా అప్పుడే ఉద్యోగాన్వేషణ చేద్దామనుకుంది.

'నీ కెక్కడయినా ఉద్యోగం దొరికినా ఇక్కడే ఉండటానికి వీలుంటే తప్పనిసరిగా ఉండు. రెండుగదులెట్లానూ వున్నాయి. నువు ఇంట లేనప్పుడు పిల్లని కనిపెట్టుకు వుంటానికి నౌకర్ను పెడదాం' అన్నాడు సీతాపతి.

సుజాత కూతురు సీతాపతికి బాగా అలవాటైపోయింది. ఎంత బాగా అలవాటై పోయిందంటే, వీళ్లిద్దరి సరాగాలూ చూచి ఒక్కోప్పుడు సుజాత కూడా సిగ్గుపడుతూ ఉంటుంది! రోజూ సాయంత్రం ఇంటికి రాగానే అతని చూపులు బేబీ యెక్కడుందా అనే వెదుకుతుంటాయి.

కొద్దిరోజుల్లోనే కథ ముదురుపాకాన పడింది. సీతాపతి ప్రవర్తన సుజాతని అంధకారంలోకి తోసేస్తున్నట్లవుతోంది. అమె కనేక ఉద్రేకపుటూహలున్నాయి. ఒకదాన్లోంచి మరోదాన్లోకి దూకుతుంది. ఎక్కువసేపు ఒంటరిగా ఆలోచనలతో గడుపుతోంది. తన ఆలోచనల నన్నిటినీ మాటల్లో పెట్టటం ఆమెకు చేతకావటం లేదు. అయితే అవి ఆమె హృదయంలో నిశిత స్థానాన్ని ఆక్రమించుకోనున్నాయి. తను ఏ పరిస్థితుల్లో ఇక్కడ చేరిందో ఆలోచిస్తే మనస్సుకు గాలివాన తాకినట్లవుతోంది. జీవితంలో ఒకటి తరువాత ఒకటిగా వచ్చే ఇబ్బందుల నెదుర్కొనే సాహసం లేక దిగజారి పోయింది తను! నాగరికుల దృష్టిలో పతనస్థాయికి పడిపోయింది. సీతాపతి తనకో ఆర్త త్రాణ పరాయణునిలా కనిపిస్తున్నాడు. మనసులో ఆ మనిషంటే యెంత ఇష్టం లేకపోయినా పరిస్థితులకు వారసురాలై ఇక్కడ చేరింది. తను ఇక్కడ వుంటంలో ఆనందం లేక పోలేదు. దమ్మిడీ ఖర్చు పెట్టాలన్న ఆదుర్దా లేదు. బాధ్యతలంటూ ఏమీ లేవు. సీతాపతి తననో ఉత్పాత సమయంలో రక్షించాడు. అతనికి తనెంతైనా కృతజ్ఞురాలు. మొదటి రోజుల్లో అతను తన నెంత ప్రేమించేవాడో తను అతన్నెంత నిర్లక్ష్యంగా చూచేదో గుర్తు తెచ్చుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

అయితే ఇప్పుడు తనని సీతాపతి నిర్లక్ష్యం చెయ్యటాన్ని తల్చుకుంటే మరీ ఆశ్చర్య మనిపిస్తుంది. అక్షరాలా అతను పెద్ద మనిషే సందేహం లేదు. అయితే

అతను ఇంకెవరినైనా ప్రేమిస్తున్నాడేమో ననుకుంది. దీనికే ఆధారాలూ కనిపించవు. సీతాపతికి ఉత్తరాలు రావు. అతని దగ్గరయినా ఆడవాళ్ళ ఫోటోలు ఏమీ లేవు. సుజాత సీతాపతిని ఈ విషయంలో ఎన్నో ప్రశ్నలు వేసింది. అతనన్నింటికీ నిర్వికారంగా జవాబు చెప్పాడు. వాటిలో ఏమీ ప్రేమ సూచనలు లేవు. 'అబ్బే, ఇతనెవర్నీ ప్రేమించటం లేదు' అన్న నిశ్చయానికి వచ్చేసింది. దీంతో సుజాతకు యెంతో భారం వదిలిపోయి నట్లయింది; ఏమంటే అతనింకా తనను ప్రేమించగల అవకాశాలు ఉన్నాయన్న మాటేగదా! అయితే అతని ప్రవర్తన మళ్ళీ చిక్కులు తెచ్చి పెడుతోంది. తన యెడల అతని ప్రకృతి ఇదే అయితే, తనను ఈ ఇంటికి రమ్మని ఎందుకు కోరాలి? ప్రయోజనంలేని జీవకారుణ్యం సీతాపతి అవలంబిస్తున్నాడని తనెట్లా నమ్ముతుంది? ఇంతకూ సీతాపతి అదో తరహా మనిషి కిందికి తేలుతున్నాడు.

సీతాపతిని ఆకర్షించేందుకు ఎన్ని ఉపాయాలు ఆలోచించినా అన్నింట్లోనూ సుజాత ఓడిపోతూనే ఉంది. ఈ వైఫల్యాల మూలంగా ఆమె కెన్నోసార్లు ఏడుపు కూడా వచ్చింది. సుజాత చెయ్యి తగిలితేనే అపవిత్రం అయిపోయేట్లు ఫీలవుతున్నాడు సీతాపతి. ఒక్కోసారి అతనికి కోపం కూడా వస్తోంది. సుజాతకు ఏ దారీ తోచదు. నిద్రపట్టదు. ఎప్పుడూ సీతాపతి గురించే ఆలోచన. ఏం చేస్తే తను సీతాపతికి సన్నిహితం కాగలదు?

ఒకనాడు రాత్రి స్నేహితుడి ఇంటికి విందుకు వెళ్లాడు. చాలా ఆలస్యంగా గాని ఇంటికి రానని సుజాతతో చెప్పి వెళ్ళాడు. అట్లాగే దగ్గరదగ్గర ఒంటిగంటకు ఇల్లు చేరుకున్నాడు. తలుపువేసి ఉండటంలో అతనికి చిరాకనిపించింది. సుజాత తలుపు తెరవగానే 'తలుపెందుకు గడియ వేశావు? పనివేళా నీ నిద్రపాడు చెయ్యాల్సి వచ్చింది' అన్నాడు.

'నేను తెరిచే వుంటాను, మరి అవెట్లా గడియపడ్డాయోగాని'.

'సరే వెళ్ళిపడుకో' అంటూ సీతాపతి బూట్లు విప్పుకుంటూ కూర్చున్నాడు. అతని కళ్లు జ్యోతుల్లా వెలిగిపోతున్నాయి. చెంపలు ధగధగ మెరుస్తున్నాయి. బహుశా విందులో సుఖపానీయాలు సేవించి వుంటాడనుకుంది సుజాత.

'నువ్వు నిద్రపోవా?' అనడిగింది.

'అప్పుడే ఆ ఆలోచనలేదు. నేనక్కడికి వెళ్లింది మొదలు తిరుగు ముఖం పట్టేంత వరకూ నా మిత్రుడు లక్ష విషయాలు చెప్పాడు. అవన్నీ సమాలోచించుకోవాలి'.

'దేన్ని గురించీ?'

'ఒకటని నియమమా? ఆకాశం కింద వున్న అన్నింటిని గురించీని! మా గొంతులు మిన్నుముట్టుతూ యున్న మాటే గాని వినేవాడు సున్న!'

సీతాపతి సహజంగా నవ్వాడు. సుజాత కూడా నవ్వింది. మనుషుల తరహా ఆమెకి తెలుసు. ఇట్లా జరుగుతుందని సుజాతకు సుగ్రాహ్యమే. 'అయితే నేనూ ఇక్కడే కూర్చుంటాను' అని సుజాత అతని జవాబుకోసం ఎదురు చూడకుండానే అతనికి దగ్గరగా కూచుంది.

'నీకు నిద్రరాకపోతే పోనీ దుస్తులు వేసుకో, ఎట్లైనా తిరిగివద్దాం' అన్నాడు సీతాపతి.

'నాకు కులాసాగానే వుంది సీతాపతి' అంటూ సుజాత అతని మెడచుట్టూ చేతులు వేసి ముఖం ముఖం ముందుపెట్టి 'నేనంటే నీకెందుకంత కోపం సీతా' అనడిగింది. సీతాపతి లేద్దామనుకున్నాడు గాని సుజాత ఆ ప్రయత్నాన్ని దుస్సాధ్యం చేసింది. 'నేన్నిన్ను ప్రేమిస్తున్నాను సీతా' అంది సుజాత.

'అర్థం పర్థం లేని చెత్త మాట్లాడకు'.

'నిజం సీతాపతీ! నువ్వు లేంది నాకు ప్రపంచం లేదు. నాకు నువ్వే కావాలి!'

సుజాతనుంచి సీతాపతి ఎట్లాగో ఇవతల పడ్డాడు. 'నువ్వు తెలివితక్కువ దానివై, నన్నో శుద్ధచవట కింద తయారు చెయ్యకు సుజాతా, వెళ్ళు'.

'నేన్నిన్ను ప్రేమిస్తున్నాను, లోగడ చేసిందానికి పశ్చాత్తాప పడుతున్నాను. నేనింక స్తబ్దుగా వుండలేను. ఇది మానవ ప్రకృతికే విరుద్ధ లక్షణం'.

సీతాపతి లేచి అవతలికి వెళుతూ 'చాలా ఆలస్యం అయిపోయింది సుజాతా' అన్నాడు.

హృదయం అట్టడుగునుంచి సుజాత ఒక్క నిట్టూర్పు విడిచింది. 'ఎట్లా? ఎట్లా ఆలస్యం అయింది సీతాపతీ? నువ్వు ఇంత కర్కోటకుడివెట్లా అయినావు?'

'నిన్ను విపరీతంగా ప్రేమించి ఉండటమే ఇందుక్కారణం అనుకుంటాను. ఇలాంటి ఆలోచనే నన్ను సంభ్రంలో దించుతుంది. పూర్వపరిస్థితులన్నీ ఒక్కసారిగా మర్చిపోవటం నాకు సాధ్యం కాదు. నాచేత కాదు సుజాతా!'

సుజాత అతని చెయ్యందుకుని ముద్దులతో నింపేసింది. 'అబ్బ' అన్నాడు సీతాపతి.

'నాకీ ఎడారి జీవితం అగమ్యంగా వుంది. నువ్వు నన్ను ప్రేమించకపోతే నేను వెళ్ళిపోతాను' అన్నది సుజాత.

'తెలివితక్కువగా మాట్లాడకు సుజాతా! ఎక్కడికి వెడతానంటావు? నీ ఇష్టం వచ్చినంతకాలం నువు ఇక్కడే ఉండవచ్చు నని నే నిదివరకే చెప్పాను కదా! నువ్విక్కడ వుండేందుకు ప్రాతిపదిక మనిద్దరం స్నేహితులం అనే మరేం కాదు'.

సుజాత నీరసంగా నవ్వింది. సీతాపతి దగ్గిరగా పోయి నింపాదిగా 'ఏదో ప్రపంచంలో వున్నట్లు మాట్లాడకు సీతాపతీ! నీ విచారం ఏమిటో నాకు తెలుసు. కాని నే నెంత అందంగా వుంటానో ఆలోచించావా?' సుజాత అతని ముఖానికి తన ముఖం ఎదురుగా పెట్టి తన చెంపతో అతని చెంప రాచింది. ఆమె నవ్వొక ప్రభాత గీతి. ఆమె కళ్ళల్లో వెలుగులు దారి చూపే దీపకళికలు. సీతాపతి వెనక్కి ఒరిగాడు 'ఉహు'.

ఇంతతో సుజాత ఒదిలిపెట్టలేదు. ఆమె పెదిమలు అతని ముఖాన్ని వెదుకుతున్నాయి. సీతాపతి బలప్రయోగంతో అవతలపడ్డాడు.

'నన్ను విసిగిస్తున్నావు'.

'నేనా?' సుజాత అతని వైపోక్షణం నిశితంగా చూచింది. ఆమె చెంపలమీద రెండు రక్తజీరలు కనిపించాయి. ఆమె ఒక్కసారి చలించిపోయి కోపోద్రిక్త హాసంతో 'నేన్నిన్ను విసిగిస్తున్నాను' అన్నది. కోపోద్రిక్తతతో అనరాని మాట అనటం మొదలెట్టింది. భాషలో తనకు పరిచయమున్న అన్ని తిట్లూ తిట్టింది. సీతాపతి మదికి వచ్చి ముఖంలో ముఖం పెట్టి ఉపన్యాసధోరణిలో అంది 'నువంటే నే నెప్పుడూ లక్ష్యపెట్టలేదు - నిన్నో శుద్ధచవట కిందే భావిస్తున్నాను. నువ్వంటే నాకు పరమ అసహ్యం. డబ్బనే కీలకం వల్లగాని లేకపోతే నిన్ను నేను తాకనివ్వను. నువు ముట్టుకుంటే నా ఒళ్ళు తేళ్ళూ జెర్రులూ పాకినట్లవుతుంది. లోకం నిన్ను చూచి నవ్వుతోంది. నువ్వొట్టి మూర్ఖపు పందివి!' శుద్ధ మొద్దు స్వరూపమనీ ప్రయోజన కారయిన పని ఒక్కటీ జీవితంలో యెరుగవనీ స్వార్థ పరుడవనీ నోటికివచ్చినట్లల్లా దులిపేస్తోంది. చిట్టచివరకు తుదిబాణం విసిరి అవతలికి వెళ్ళింది. 'అందవికారుడా!' ఈ తిట్టుతో సీతాపతి సమూలంగా విరిగిపడి పోతాడని సుజాతా యెరుగును.

✧ ✧ ✧

మర్నాడుదయం సీతాపతి గాభరాపడి లేచేసరికి గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. ఇంకా సుజాత లేవనే లేదు. గది తలుపు చప్పుడు చేస్తూ 'సుజాతా, ఇప్పటికే ఆలస్యం అయింది. లే... లే...' అన్నాడు. కాని సమాధానం రాలేదు. బహుశా నాటకమాడుతుందేమో ననుకున్నాడు. తను బయల్దేరటం అసలే ఆలస్యం అయిన ఇలాంటి సమయంలో సుజాత పరిహాసాలాట్టం అతనికి కొద్ది చిరాకనిపించక పోలేదు. గబగబా తన పనిమీద తను బయటికి వెళ్ళిపోయాడు. మళ్లీ సాయంత్రం వరకూ ఇంటి సంగతులు ఆలోచించేందుకు తీరికే దొరికింది కాదు. సాయంకాలం ట్రాంలో ఇంటికి తిరిగివస్తూ ఈ పూట సుజాత ఏం తమాషా చేస్తుందో నని ఊహించు కుంటున్నాడు. దురదృష్టవశాత్తూ అతని ఊహలన్నీ తలకిందైనాయి. ఇల్లు తాళంవేసి ఉంది. లోపల దీపం లేదు. తాళంచెవి బయట గూట్లో వుంది. సుజాత యెప్పుడేనా అవతలికి వెళ్ళినప్పుడు ఇట్లా చెయ్యటం అలవాటే; కాని తీరా లోపల అడుగుపెట్టే టప్పటికి పరిస్థితంతా తారుమారుగా వుంది. అద్దం ఎన్ని ముక్కలయిందో లెక్కలేదు. గోడనున్న ఫోటోలూ బొమ్మలూ అన్నీ వికృత రూపాల్లో ఉన్నాయి. తన తైలచిత్రం పేలికలు పేలికలై పోయింది. తన గదిని యెంత పాడుచెయ్యటానికి వీలవుతుందో అంతగానూ పాడుచేసింది సుజాత! ఎంతపనిచేసింది!! సీతాపతి నిర్విణ్ణుడయినాడు. పాపం, సుజాత! కసి తీర్చుకుందుకు ఇంత కన్నా మరో సదుపాయం లేని సుజాత! ఈ సామాన్లు పాడుచేసేందుకు ఎంత అవస్థ పడిందో గద!

సుజాత కూతురు జ్ఞాపకానికి వచ్చి సీతాపతి క్షణం ఆలోచించాడు. కాని సుజాత తననుంచి విడివడటం బాగానే వుంది. 'ఇంకా ఈ జీవితంలో ఆమె నాకు తారసిల్లకుండా వుంటే దేవుడికి కోటి నమస్కృతులు' అనుకున్నాడు. సీతాపతికి ఈ గది వదిలేసి ఇంకెక్కడికైనా పోతే బాగుంటుందని తోచింది.

సుజాతకోసం తను ఎంత ఖర్చు పెట్టాడో లెక్కలేదు. ఈ స్మృతులన్నీ తాను ఎంత త్వరగా మర్చిపోగలిగితే అంత మంచిది. తన జీవితంలో సుజాత కేవలం ఒక ఘటన! మనుష్యుల బహిశ్చేష్టలకీ అంతర్గతపు టాలోచనకీ సంధి కలిపే ఒక మహాగాథ అతనికి సుజాత! సుజాత!! మర్చిపోవలసిన సుజాత అయింది ఈనాటికి!

('సోమర్సెట్ మామ్' – 'ఆఫ్ హ్యూ మన్ బాండేజ్'లోని ఒక సంఘటన)

అభిసారిక

❖